క్లుప్తంగా

పదోన్నతిపై సీనియర్ సివిల్ జడ్జి బదిలీ



కైకలూరు: సీనియర్ సివిల్ కోర్టు జడ్జి జి.షణ్ముఖరావు పదోన్నతిపై విశాఖపట్నం జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన గాజువాక 9వ అదనపు జిల్లా కోర్టు జడ్జిగా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా బార్ అసోషియేషన్ ఆధ్వర్యంలో వీడ్కోలు కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. జూనియర్ సివిల్ జడ్జి బి.శ్రీనివాస్ సీనియర్ సివిల్ జడ్జి సేవలను కొనియాడారు. అనంతరం జడ్జి షణ్ముఖరావు దంపతులను న్యాయవాదులు ఘనంగా సన్మానించారు. ఆయనతో కలిసి పనిచేసిన అనుభవాలను న్యాయవాదులు, కోర్టు సిబ్బంది గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంవీవీ సత్యనారాయణ, సీనియర్ న్యాయవాదులు తుమ్మలపల్లి బాలకృష్ణారావు, గొర్తి ప్రభాకర దీక్షితులు, గురజాడ ఉదయశంకర్, టి.శ్రీనివాసరావు, కారి శరత్‌బాబు, ఎంఎస్ఎస్.రాజు, బందెల లక్ష్మణరావు, చావలి శంకరశాస్త్రి, పి.పవన్‌కాంత్, పాములు, ఇందిరా, రజీమున్నీసా, ఇతర న్యాయవాధులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



పామర్రు: స్థానిక 15వ వార్డుకు చెందిన ఎర్రపోతు భారతీదేవి ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో స్థానిక శాసనసభ్యుడు కైలే అనిల్ కుమార్ ఆదేశాల మేరకు మంగళవారం మృతురాలి భర్త ఎర్రపోతు ఏసుదాసుకు వైఎస్సార్ బీమా పథకంలో భాగంగా మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేల నగదును అందజేశారు. త్వరలో బీమా క్లెయిమ్ మొత్తాన్ని మృతురాలి కుటుంబానికి అందజేస్తామని గ్రామ సర్పంచ్ కేతావతు కస్తూరి, గ్రామ ఉప సర్పంచ్ దేవిరెడ్డి బాల వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. వెల్ఫేర్ అసిస్టెంట్ సమీర్ హుస్సేన్, నందిపాటి సురేష్ రెడ్డి, వలంటీర్ బి.రేఖ పాల్గొన్నారు.

అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిని శిక్షించాలి



కూచిపూడి(మొవ్వ): భారత రాజ్యాంగాన్ని, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన శిక్షించాలని అంబేడ్కర్ యూత్ సభ్యులు కోరారు. ఇటీవల కొన్ని చానల్స్‌లో, సోషల్ మీడియాలో రాజ్యాంగానికి, అంబేడ్కర్‌కు సంబంధించి వివాదాస్పదంగా మాట్లాడుతున్న హమారా ప్రసాద్, లలిత్ కుమార్‌లపై అంబేడ్కర్ యూత్ సభ్యులు మంగళవారం కూచిపూడి ఎస్ఐ డి.సందీప్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా యూత్ సభ్యులు మాట్లాడుతూ ప్రపంచ మేధావిగా కొనియాడుతున్న అంబేడ్కర్ గురించి రాజకీయ స్వార్థంతో, మూర్ఖత్వంతో ఆయన్ను తక్కువ చేసి మాట్లాడటం తగదన్నారు. కుట్రపూరిత రాజకీయ ప్రోద్బలంతో ఇటువంటి దుచర్యలకు ఎవరైనా వ్యవహరిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని చెప్పారు. ఇటువంటి వారిని దేశ ద్రోహులుగా పరిగణించి కఠిన శిక్షలు విధించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు జార్జ్ ముల్లర్, కొప్పుల రాజేంద్ర, సాలి సునీల్, సీహెచ్ ఏడుకొండలు, సహదేవుడు, మాతంగి గోపి పాల్గొన్నారు.

నరసింహారావు సేవలు ప్రశంసనీయం



పమిడిముక్కల: బీపీఎం ఎన్‌వీఎల్ నరసింహారావు సేవలు ప్రశంసనీయమని పోస్టల్ ఉద్యోగులు పేర్కొన్నారు. తాడంకి బ్రాంచి పోస్టుమాస్టర్‌గా 40 ఏళ్లు పనిచేసి సోమవారం నరసింహారావు ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా మంటాడ ఎస్‌ఓ పరిధిలోని పోస్టల్ ఉద్యోగులు నరసింహారావు దంపతులను ఘనంగా సత్కరించి, ఆయన సేవలను కొనియాడారు.

హోంగార్డు కుటుంబానికి చెక్కు అందజేత

కోనేరుసెంటర్: చందర్లపాడు పోలీస్ స్టేషన్‌లో జీబు డ్రైవర్‌గా పనిచేస్తూ గత నెల గుండె పోటుతో మరణించిన హోంగార్డు కత్తి చిన్న వెంకటయ్య కుటుంబానికి హోంగార్డ్స్ వన్డే కాంట్రిబ్యూషన్‌గా సేకరించిన రూ. 3,91,210 చెక్కును ఆయన సతీమణి కత్తి సౌమ్యకి జిల్లా ఎస్పీ పి.జాషువా మంగళవారం ఆయన కార్యాలయంలో అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ చనిపోయిన హోంగార్డ్ కత్తి చిన వెంకటయ్య కుటుంబానికి ఎప్పుడు ఎలాంటి సహాయం కావాలన్నా నేరుగా అధికారులను కలువవచ్చునన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

దండాలయ్యా.. ఉండ్రాలయ్యా



పమిడిముక్కలలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



గుడివాడలో పూజలు చేస్తున్న నాయకులు

- ఘనంగా వినాయక చవితి వేడుకలు
- వాడవాడలా పండుగ కోలాహలం
- తొమ్మిది రోజుల పాటు విశేష పూజలు



కైకలూరులో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే డీఎన్నార్, కుటుంబ సభ్యులు

పామర్రు: పామర్రు, గుడివాడ, కైకలూరు నియోజకవర్గాల వ్యాప్తంగా వినాయక చవితి వేడుకలను సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండల పరిధి నిమ్మకూరు గ్రామంలోని ఏపీఆర్ఎస్‌లో ప్రిన్సిపాల్ ఎంవీ పద్మకుమారి ఆధ్వర్యంలో చవితి వేడుకలను నిర్వహించారు. తొలుత విద్యార్థులందరూ విఘ్నేశ్వరస్వామికి విశేషంగా పూజలు చేశారు. పామర్రు గ్రామంలోని వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో వాసవీ ఆర్యవైశ్య యువజన సంఘ సభ్యులు 31 అడుగుల మట్టి వినాయక స్వామిని ప్రతిష్ఠించి విశేషంగా పూజలు చేశారు. స్థానిక బాపూజీ గౌడ్ యువత ఆధ్వర్యంలో వినాయ చవితి పూజలను ఘనంగా నిర్వహించారు. మేకల నాని ప్రత్యూష దంపతులు విగ్రహ దాతలు, ఆరేపల్లి రాకేష్ ఆధ్వర్యంలో తొలిరోజు పూజా కార్యక్రమాలను చేపట్టారు. కార్యక్రమంలో సీఐ వెంకట నారాయణ, నాయకులు ఆరేపల్లి శ్రీనివాసరావు, పరసా కిషోర్, ఆరేపల్లి రాంబాబు, ఆరేపల్లి గోపి, పరసా వెంకటేశ్వరరావు, ఎండీ హస్మతుల్లా పాల్గొన్నారు. అనంతరం వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు. మండల పరిధి జమీదగ్గుమిల్లిలోని విఘ్నేశ్వరస్వామి మందిరంలో భక్తులు కూనపరెడ్డి వీరజనార్దనరావు మాధవి దంపతుల ఆధ్వర్యంలో విశేష పూజలను నిర్వహించారు. కార్యక్రమంలో వినోద్, శ్రీనివాసరావు, మురళీ, వీరాంజనేయులు, నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

తోట్లవల్లూరులో..

తోట్లవల్లూరు: వినాయకచవితి వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే పిల్లలు, పెద్దలు పవిత్ర స్నానాలాచరించి నూతన వస్త్రాలను ధరించారు. వినాయకుడికి ప్రీతిపాత్రమైన పిండి వంటలు, పూలు, పండ్లు, పత్రి, ఉండ్రాళ్లతో పూజలు చేశారు. తమకు సకల శుభాలు జరగాలని భక్తిశ్రద్ధలతో ప్రార్థించారు. చవితి వేడుకల సందర్భంగా తోట్లవల్లూరులోని తూర్పు యాదవ రామాలయం, పడమర గౌడ రామాలయం, సినిమా హాలు రోడ్డు, పీహెచ్‌సీ రోడ్డు, వాసవీ ఆలయం, రైస్‌మిల్ బజారు ప్రాంతాల్లో యువకులు పూజా మండపాలు ఏర్పాటు చేసి గణేష్ నవరాత్రులను వేడుకగా నిర్వహిస్తున్నారు.

పమిడిముక్కలలో వేడుకలు

పమిడిముక్కల: వాడవాడలా వినాయకచవితి వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నారు. పందిళ్లు వేసి విద్యుత్ దీపాలతో అలంకరణ చేసి, వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించి, భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తున్నారు. వీరంకిలాకు మెయిన్ సెంటర్‌లో విఘ్నేశ్వర యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. గుర్రాలంక ఏటీఎం సెంటర్ వద్ద గణేష్ యూత్ ఆధ్వర్యంలో, ప్రాథమిక పాఠశాల వద్ద బాలగణేష్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు.

మండలంలో గణేష్ నవరాత్రులను ఘనంగా నిర్వహిస్తున్నారు.

కైకలూరు నియోజకవర్గంలో పూజలు

కైకలూరు: నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని మండలాల్లో వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) దంపతులు తమ ఇంటి వద్ద ఏర్పాటు చేసిన పందిరిలో సోమ, మంగళవారాల్లో ప్రత్యేక పూజలు చేశారు. సంత మార్కెట్‌లో బంగారం ట్రావెల్స్ వద్ద ఏర్పాటు చేసిన పందిరి, వైఎస్సార్ నగర్ గ్రీన్ విలేజ్, ఆటపాక గ్రామంలో పలుచోట్ల ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. డీఎన్నార్ కాంప్లెక్స్ వద్ద కూరగాయలు, పండ్ల వర్తక సంఘం, కైకలూరు బృందావనం గేటెడ్ కమ్యూనిటీ వద్ద, కై కలూరు చిన్న చెరువు గట్టు కోదండ రామాలయం వద్ద, వార్డు సభ్యుడు తోట మహేష్ ఏర్పాటు చేసిన పందిరి, బైపాస్ రోడ్డు, ఆది వినాయకస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన చవితి పందిర్లలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే డీఎన్నార్ పాల్గొన్నారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లిరూరల్: మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయక చవితి వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో జరిపారు. ప్రతి గ్రామంలో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ముదినేపల్లిలో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ పూజలు చేసి గణపతి ఉత్సవాలను ప్రారంభించారు. ముదినేపల్లి, చిగురుకోట శివారు గంగాపురం, చినకామనపూడిలో బుధవారం అన్న సమారాధనలు నిర్వహించేందుకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.

సిందూర గణపతిగా స్వామివారు

గుడివాడటౌన్: స్థానిక మెయిన్‌రోడ్డులో వేం చేసి ఉన్న శ్రీ విఘ్నేశ్వరస్వామి వారి దేవస్థానంలో వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గణపతి నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని రెండో రోజైన మంగళవారం స్వామి వారిని సిందూర గణపతిగా అలంకరించి భక్తుల దర్శనానికి ఉంచారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.

గుడివాడ పట్టణంలో..

గుడివాడటౌన్: వినాయక చవితి పర్వదినాన్ని పట్టణంలో భక్తులు ఆనందోత్సాహం, భక్తిశ్రద్ధలతో సోమవారం జరుపుకున్నారు. వాడవాడలా పందిళ్లు ఏర్పాటుచేసి స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఏర్పాటుచేసి ప్రత్యేక పూజలు చేశారు. జై గణేశా, జైజై గణేశా సంకీర్తనలతో ఆ ప్రాంతాలు మారుమోగాయి. స్థానిక మెయిన్ రోడ్డులో వేం చేసి ఉన్న శ్రీ విఘ్నేశ్వరస్వామి వారి దేవస్థానంలో నవరాత్రి మహోత్సవాలను వైభవంగా ప్రారంభించారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వినాయక చవితి పందిరిలో వార్డు బూత్ కమిటీల కన్వీనర్ కె.ఆంజనేయ ప్రసాద్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి హనుమంతరావు, సీనియర్ నాయకులు దుక్కిపాటి శశిభూషణ్, నాయకులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

మండవల్లిలో..

మండవల్లి: మండలంలోని పలు గ్రామాల్లో గణేశ్ ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. రెండో రోజైన మంగళవారం భైరవపట్నం, అప్పాపురం, లోకుమూడి తదితర గ్రామాల్లో స్వామివారి కల్యాణోత్సవాలు నిర్వహిస్తున్నారు. స్థానిక భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయం, వెలమపేట రామాలయం, స్టేషన్‌రోడ్డు, శ్రీ కృష్ణాలయం, హైస్కూల్ సమీపంలో ఆంజనేయస్వామి ఆలయం వద్ద, సెంటర్‌లో భక్తాంజనేయ స్వామి ఆలయం వద్ద ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వాడవాడలా వేడుకలు..

మొవ్వ: తొమ్మిది రోజుల పాటు నిర్వహించే వినాయక చవితి వేడుకలను మొవ్వ మండలంలో వాడవాడలా భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. కూచిపూడి పోలీసుల పర్యవేక్షణలో ఈ వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయి. మొవ్వ మండలంలోని 21 గ్రామాల్లో దాదాపు వందకు పైగా ఏర్పాటు చేసిన పందిర్లలో గణనాథుడు ప్రత్యేక పూజలందుకుంటూ భక్తులకు వివిధ రూపాల్లో దర్శనమిస్తున్నారు. ఇందులో భాగంగా బార్లపూడి గ్రామంలో యువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పందిరిలో వేడుకలను ఉత్సాహ వాతావరణంలో నిర్వహిస్తున్నారు.



నిమ్మకూరులో పూజలు చేస్తున్న విద్యార్థులు



పామర్రు బాపూజీపేటలో..



వీరంకిలాకులో..



తోట్లవల్లూరులో పూజలందుకుంటున్న విఘ్నేశ్వరుడు



సిందూర గణపతిగా స్వామివారు



వేడుకల్లో పాల్గొన్న బార్లపూడి భక్తులు

'జగనన్న ఆరోగ్య సురక్ష'ను జయప్రదం చేయండి



పమిడిముక్కల: జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేనను జయప్రదం చేయాలని ఎంపీడీఓ విఠల్‌పాల్ ఆదేశించారు. వలంటీర్లు, వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య సమస్యలు గుర్తించి, సమస్యలున్న వారికి మెరుగైన వైద్య సేవలందించాలన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఈఓఆర్డీ కొండేటి వెంకటేశ్వరరావుతో కలిసి మంగళవారం కార్యదర్శులకు జరిగిన సమావేశంలో మాట్లాడారు. 2017–18 నుంచి 2022–23 వరకు వరకు గ్రంథాలయ సెస్ గ్రంథాలయ శాఖకు చెల్లించాలన్నారు. పొలవెల్లువ సర్వే వేగవంతం చేయాలని సూచించారు. అగినపర్రులో స్వామిత్వ సర్వేను ప్రాంభించాలని చెప్పారు. స్వచ్ఛత ఈ–సేవ ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో అమలు చేయాలన్నారు. ఆర్టీఐ, స్పందన అర్జీలను వెంటనే పరిష్కరించాలని చెప్పారు. సమావేశంలో ఏఓ రాజు, కార్యదర్శులు సుధాకర్, ప్రసాద్, రమణ, స్వామి, విజయదుర్గ, విద్యాధర్ పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో సౌకర్యాలు కల్పిస్తాం

ముదినేపల్లి రూరల్: జగనన్న కాలనీల్లో అన్నిరకాల మౌలిక వసతులు, సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య అన్నారు. మండలంలోని పెదపాలపర్రు, గురజ జగనన్న కాలనీల్లో మంగళవారం పర్యటించి ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడారు. అసంపూర్తిగా మిగిలిపోయిన ఇళ్ల నిర్మాణాలను వెంటనే పూర్తిచేసి గృహ ప్రవేశాలు చేయాలన్నారు. కాలనీల్లో విద్యుత్, తాగునీరు, డ్రెయినేజీ, అంతర్గత రోడ్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. పలు కాలనీల్లో ఇప్పటికే విద్యుత్ సౌకర్యం కల్పించి నివాసాలకు అనుగుణంగా ఉండేవిధంగా అన్నిరకాల చర్యలు తీసుకున్నామని చెప్పారు.

అగ్రహారం రహదారికి మరమ్మతులు



కైకలూరు: ఇటీవల కురిసిన వర్షాలకు ఆటపాక నుంచి అగ్రహారం వెళ్లే రహదారిలో నీరు నిలిచింది. ప్రజలు, వాహనదారులు గుంతలలో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. సమస్యను ఎమ్మెల్యే డీఎన్నార్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన సొంత ఖర్చుతో మురుగు కాల్వ వంతెన వరకు రోడ్డుకు మరమ్మతులు చేయించారు. పనులను ఎంపీపీ అడవి కృష్ణ, వైస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్, గ్రామ పెద్ద తలారి జాన్, రఫాయేల్ పర్యవేక్షించారు. ఎమ్మెల్యే డీఎన్నార్ చొరవను పలువురు వాహనదారులు, ప్రజలు అభినందించారు.

క్రైస్తవుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



పామర్రు: క్రైస్తవుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఏపీ క్రైస్తవ సంక్షేమ సంఘ అధ్యక్షుడు సాల్మన్ కొల్లాబత్తుల అన్నారు. స్థానిక విజన్ లైఫ్ సెంటర్‌లో మంగళవారం క్రైస్తవులు ఐక్యత అనే అంశంపై డిబేట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రైస్తవులకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ఆదుకుంటోందన్నారు. క్రైస్తవులు అందరూ ఐక్యతగా ఉండి పథకాలను పొందాలని చెప్పారు. క్రైస్తవుల సమాధుల స్థలాలకు నిధులు కేటాయించాలని కోరారు. క్రైస్తవ వధూవరులకు లక్ష రూపాయల ప్రోత్సాహక నగదు, స్కాలర్ షిప్‌లు, రుణాలు ప్రవేశ పెట్టి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం క్రైస్తవుల అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు టి.శాలెం రాజు, వై.సంగీతరావు, ఎం.మోషే, టి.పీటర్ సాల్మన్, ఎన్.శామ్యుల్ పాల్గొన్నారు.

గడప గడపకు సంక్షేమ ఫలాలు




ప్రభుత్వ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

లక్ష్మీపురం(పెదపారుపూడి): గడప గడపకు సంక్షేమ ఫలాలు అందజేస్తున్న దేశంలో ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ అన్నారు. మండలంలోని వెంట్రప్రగడ శివారు లక్ష్మీపురంలో మంగళవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించి బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కైలే మాట్లాడుతూ.. అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, చేదోడు – వాదోడు, వాహన మిత్ర, కాపు నేస్తం, ఇంటి వద్దకే పింఛన్, వైఎస్సార్ ఆసరా, రైతు భరోసా వంటి పథకాలను అందిస్తున్న ఘనత మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు.

నియోజకవర్గంలో ఏగ్రామంలోనైనా చిన్న సమస్య ఉన్న తన దృష్టికి తీసుకుని వస్తే పరిష్కరిస్తున్నామని ఎమ్మెల్యే కై లే తెలిపారు. గ్రామాల్లో సమస్యలు ఉంటే అర్ధరాత్రి అయిన ఒక్క ఫోన్ చేస్తే స్పందించి సమస్యను పరిష్కరిస్తానన్నారు. ఈ ప్రజా జీవితంలో మీకు సేవ చేయటానికి ఇక్కడికి వచ్చా. మరోసారి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని, ఎమ్మెల్యేగా నన్ను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. ఎంపీపీ గోగం సురేష్, ఎంపీటీసీలు చదలవాడ పద్మజ, జాజుల శ్రీనివాసరావు, పామర్రు మార్కెట్ యార్డు డైరెక్టర్లు చీకుర్తి వరప్రసాద్, గోళ్ల వెంకటేశ్వరరావు, చేబ్రోలు సుజాత, మాజీ జెడ్పీటీసీ మూల్పూరి హరీష తహసీల్దార్ వి.నాగభూషణం, ఇన్‌చార్జి ఎంపీడీవో యద్దనపూడి రామకృష్ణ, పార్టీ గ్రామ కన్వీన,ర్ మండవ జానకరామయ్య(మున్నా), నాయకులు అన్వర్ బాషా, బాజీ పటాన్, కరిముల్లా, షేక్ అజీజ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద తయారీతో ఆదాయం



గన్నవరంలో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీఓ శ్రీనివాస్ విశ్వనాథ్ తదితరులు

మండవల్లి: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల ద్వారా గ్రామ పంచాయతీలకు అదనపు ఆదాయం వస్తోందని డీపీఓ టి.శ్రీనివాస్ విశ్వనాథ్ తెలిపారు. మండలంలోని గన్నవరంలో గ్రామ సచివాలయం, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆయన సోమవారం పరిశీలించారు. త్వరితగతిన సంపద తయారీ కేంద్రాల్లో వర్మీ కంపోస్టు తయారు చేసి రైతులకు విక్రయిస్తే గ్రామ పంచాయతీలకు వచ్చే ఆదాయాన్ని పలు కార్యక్రమాలకు వినియోగించుకోవచ్చన్నారు. గన్నవరంలో ప్రస్తుతం వర్మీ కంపోస్టు తయారు చేస్తున్నారని, పూర్తిస్థాయిలో కంపోస్టును తయారు చేసి విక్రయించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. స్థానిక సచివాలయంలో రిజిస్టర్లు తనిఖీ చేశారు. స్పందన అర్జీలు పూర్తిస్థాయిలో పరిష్కరించాలన్నారు. భూ రక్ష కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని సూచించారు. ఈఓపీఆర్డీ బి.ఆనందబాబు, సర్పంచ్ గుడివాడ శ్రీదేవి, మాజీ సర్పంచ్ గుడివాడ తమ్మిస్వామి, కార్యదర్శి రాధిక పాల్గొన్నారు.

కాలిబాట వంతెనలు ప్రారంభం



కైకలూరులో వంతెనను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, నాయకులు

కైకలూరు: శిథిలావస్థకు చేరిన కాలిబాట వంతెనల స్థానంలో నూతన వంతెనలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) చెప్పారు. మండల పరిషత్ నిధులు రూ.13.30 లక్షలతో ఎస్టీ కాలనీ, పిట్ల బ్రహ్మాజీ నివాసం వద్ద పోల్ రాజ్ కాల్వపై రెండు వంతెనలను ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. రెండు వంతెనలకు డీఎన్నార్, ఆయన తండ్రి దూలం వీరన్న పేర్లను పెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తాగునీటి కాలువల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి వెంకట కృష్ణ, సర్పంచ్ మేరీ నవరత్నకుమారి, వైస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్, ఎంపీటీసీలు మంగినేని రామకృష్ణ, మూడేడ్ల శశికళ, వార్డు సభ్యులు సమతం శ్రీను, మహమ్మద్ గాలిబ్‌బాబు, తోట మహేష్, వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు భట్రాజు శివాజీ, నాయకులు కరేటి రాంబాబు, మూడేడ్ల గౌరి నాయుడు, కొణిజేటి రవికుమార్, అబ్దుల్ రఫీ, షేక్ భాష, యక్కలి లక్ష్మీ దీపక్, పంచాయతీ ఈఓ శివన్నారాయణ, పార్టీ కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక



శశి శ్రీని అభినందిస్తున్న హెచ్ఎం ఉమామహేశ్వరరావు, అనూరాధ



కీర్తన చత్రియ, జి.ప్రణతితో గౌతమ్ ప్రిన్సిపాల్ సత్యారామ్, సత్యన్వేష్



జ్యోతిగణేష్‌తో హెచ్ఎం జి.పద్మావతి, శ్రీనివాస్

గుడివాడటౌన్: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి ఆటల పోటీల్లో బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొనేందుకు గుడివాడకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఈనెల 16వ తేదీ నూజివీడులోని బీఐఎస్ పాఠశాలలో అండర్–14, 17 బాలబాలికల విభాగాలకు జరిగిన ఎంపిక పోటీల్లో పాల్గొన్న ఏకేటీపీ బాలికోన్నత పాఠశాలకు చెందిన ఎం.శశిశ్రీ, మాంటిస్సోరి ఇంగ్లిష్ మీడియం విద్యార్థి ఎం.జ్యోతిగణేష్, గౌతమ్ స్కూల్‌కు చెందిన జి.ప్రణతి అండర్–14 విభాగంలో ప్రతిభను ప్రదర్శించి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. గౌతమ్ స్కూల్‌కు చెందిన కె.కీర్తన చత్రియ అండర్–17 విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను, కోచ్‌లను, వ్యాయామ ఉపాధ్యాయులను ఆయా పాఠశాలల హెచ్ఎంలు, గౌతమ్ స్కూల్ ప్రిన్సిపాల్ సత్యారామ్ అభినందించారు.